క్లుప్తంగా

దగ్ధమైన ఈత చెట్లను పరిశీలించిన సీఐ



ఈత చెట్లను పరిశీలిస్తున్న సీఐ సైదా

గజ్వేల్‌రూరల్‌: మండల పరిధిలోని అహ్మదీపూర్‌లో ఇటీవల దగ్ధమైన ఈత చెట్లను సీఐ సైదా శుక్రవారం పరిశీలించారు. ఆ గ్రామ గౌడ సంఘం సభ్యుల ఫిర్యాదు మేరకు ఆయన గ్రామంలో విచారణ చేపట్టారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎల్లమ్మ ఆలయం వద్ద ఈత చెట్ల దగ్ధమైన ఘటనపై విచారణ చేపట్టామన్నారు. బాధ్యులైన వారిపై చర్యలు తీసుకొంటామని చెప్పారు. ఎల్లమ్మ ఆలయ పరిసరాల వద్ద సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని గౌడ సంఘం సభ్యులకు సూచించారు. కార్యక్రమంలో నర్సాగౌడ్‌, సత్యనారాయణగౌడ్‌, వెంకటేశ్‌గౌడ్‌, బాల్‌రాజుగౌడ్‌, బాబుగౌడ్‌, వెంకట్‌గౌడ్‌ తదితరులు పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభం



చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న మిత్రబృందం

జగదేవ్‌పూర్‌(గజ్వేల్‌): స్థానిక ఆర్టీసీ బస్టాండ్‌లో పట్టణానికి చెందిన అమర శ్రీనివాస్‌ జ్ఞాపకార్థం ఆయన మిత్రబృందం శుక్రవారం చలివేంద్రాన్ని ప్రారంభించింది. ఈ చలివేంద్రాన్ని కాంగ్రెస్‌ మండలాధ్యక్షుడు రవీందర్‌రెడ్డి, ఆర్య వైశ్య సంఘం మండలాధ్యక్షుడు శ్రీనివాసరావు శుక్రవారం ప్రారంభించారు. కార్యక్రమంలో నాయకులు రాము, చంద్రశేఖర్‌, శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యే పరామర్శ



సురేశ్‌తో మాట్లాడుతున్న బాలకిషన్‌

బెజ్జంకి(సిద్దిపేట): మండలంలోని ముత్తన్నపేట గ్రామానికి చెందిన బొర్ర బుచ్చవ్వ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన విషయం తెలుసుకొని వారి కుమారుడు స్వేరోస్‌ రాష్ట్ర నాయకుడు సురేశ్‌ను శుక్రవారం మానకొండూర్‌ మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్‌ పరామర్శించారు. బుచ్చవ్వ చిత్రపటం వద్ద నివాళులర్పించారు. కార్యక్రమంలో మహిపాల్‌రెడ్డి, లక్ష్మణ్‌, శ్రీనివాస్‌గుప్త, తిరుపతి, శేఖర్‌బాబు, శ్రీను, శంకర్‌, అంజి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా రెడ్‌ బుక్‌ డే



పుస్తక పఠనంలో పాల్గొన్న నాయకులు

చేర్యాల(సిద్దిపేట): స్థానిక పార్టీ కార్యాలయంలో సీపీఎం నాయకులు ప్రపంచ రెడ్‌ బుక్‌ డే వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణ, మండల నాయకులు సామూహిక పుస్తక పఠనం నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యుడు వెంకట్‌మావో, మండల కార్యదర్శి అరుణ్‌కుమార్‌, నాయకులు శోభ, శ్రీహరి, ప్రభాకర్‌, కనకయ్య, శ్రీకాంత్‌, శ్రీనివాస్‌, కుమార్‌, సిద్దులు, యాదగిరి, చంద్రం, ఆంజనేయులు, బ్రహ్మయ్య, అశోక్‌ పాల్గొన్నారు.

పెద్దమ్మ గుడికి రూ.3లక్షల విరాళం



విరాళం అందజేస్తున్న జైపాల్‌రెడ్డి

వర్గల్‌(గజ్వేల్‌): మండల పరిధిలోని మైలారంలో పెద్దమ్మ గుడి నిర్మాణానికి తన వంతుగా చాంద్‌ఖాన్‌ మక్త గ్రామానికి చెందిన డాక్టర్‌ మేదిని జైపాల్‌రెడ్డి(ఎన్‌ఆర్‌ఐ) రూ.3లక్షల విరాళం అందజేశారు. గురువారం రాత్రి తన సోదరులు రామలింగారెడ్డి, వెంకటేశ్వర్‌రెడ్డి, గ్రామస్తుల సమక్షంలో ఆయన మైలారం ముదిరాజ్‌ సంఘ ప్రతినిధులకు ఆ మొత్తాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ముదిరాజ్‌ ప్రతినిధులు ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు.

విద్యుత్‌ మీటర్‌ ధ్వంసం

హుస్నాబాద్‌రూరల్‌: మండలంలోని జిల్లెలగడ్డ ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలకు చెందిన విద్యుత్‌ మీటర్‌ను ఆకతాయిలు ధ్వంసం చేసినట్లు ఉపాధ్యాయులు శుక్రవారం తెలిపారు. తాగునీటి ట్యాంక్‌ పైకప్పును కూడా పడగొట్టారని, అధికారులు పాఠశాల ప్రహరీ నిర్మాణానికి నిధులు మంజూరు చేస్తే ప్రహరీ ఎత్తు పెంచుతామని చెప్పారు.

గోదాం.. నిర్వహణ శూన్యం

- శిథిలావస్థలో భవనం
- పట్టించుకోని పాలకవర్గం
- మరమ్మతులు చేపట్టాలని రైతుల విన్నపం



శిథిలావస్థకు చేరిన కడవేర్గులోని భవనం

చేర్యాల(సిద్దిపేట): పీఏసీఎస్‌ పరిధిలోని కడవేర్గు గ్రామంలో ఉన్న గోదాం భవనం శిథిలావస్థకు చేరింది. గతంలో ఉమ్మడి చేర్యాల మండల పరిధిలో మూడు సింగిల్‌ విండోలు ఐనాపూర్‌, దొమ్మాట, చేర్యాల ఉండేవి. వాటికిగాను కడవేర్గు, వేచరేణి, చేర్యాలలో సొంత భవనాలుండేవి. అందులో కడవేర్గు, వేచరేణిలోని భవనాలను గోదాములకు వినియోగించారు. చేర్యాలలో భవనం 'సింగిల్‌ విండో' కార్యాలయంగాను, గోదాంగాను నిర్వహిస్తూ పరిసర గ్రామాల రైతులకు సేవలు అందించేవారు.

సింగిల్‌ విండో వ్యవస్థ రద్దు

కాలక్రమేణా సింగిల్‌ విండో వ్యవస్థను ప్రభుత్వం రద్దుచేసి మండలానికో వ్యవసాయ ప్రాథమిక సహకార సంఘం(పీఏసీఎస్‌) ఏర్పాటు చేసింది. ఆ భవనాలను పీఏసీఎస్‌కు అప్పజెప్పింది. దీంతో మండల పరిధిలోని గ్రామాలన్నీ చేర్యాల పీఏసీఎస్‌ పరిధిలోకి వచ్చాయి.

నిర్వహణలో నిర్లక్ష్యం

మండల కేంద్రంలోని సింగిల్‌ విండో కార్యాలయ భవనం నుంచే పీఏసీఎస్‌ కార్యాలయ పనులు జరుగుతున్నాయి. మిగిలిన రెండు(కడవేర్గు, వేచరేణి) భవనాలు గోదాం, వివిధ అవసరాలకు వినియోగిస్తున్నారు. అప్పటి నుంచి నిర్వహణ, మరమ్మతులు చేపట్టక భవనాలు పూర్తిగా శిథిలావస్థకు చేరాయి. కడవేర్గు భవనాన్ని కొన్ని రోజులు గోదాం, అంగన్‌వాడీ కేంద్రంగా ఉపయోగించారు.

పట్టించుకోవడం లేదు..

కొద్దిరోజులుగా భవనం నిరుపయోగంగా ఉండడంతో పూర్తిగా శిథిలావస్థకు చేరింది. ప్రభుత్వాలు, అధికారులు, పాలకవర్గాలు పట్టించుకోకపోవడంతోనే భవనాలు ఈ స్థితికి చేరాయని రైతులు వాపోతున్నారు. ఇప్పటికైనా స్పందించి భవనానికి మరమ్మతులు చేయించి వినియోగంలోకి తేవాలని కోరుతున్నారు.

ప్రతిపాదనలు పంపాం, నిధులు రాగానే చేస్తాం



చేర్యాల పీఏసీఎస్‌ పరిధిలో ఉన్న గోదాముల మరమ్మతుల కోసం ప్రతిపాదనలు సిద్ధంచేసి జిల్లా అధికారులకు పంపించాం. నిధులు మంజూరు కాగానే పనులు పూర్తిచేసి రైతులకు అందుబాటులోకి తెస్తాం.

– మేర్గు కృష్ణాగౌడ్‌, పీఏసీఎస్‌ చైర్మన్‌, చేర్యాల

పార్టీ అభ్యర్థులకే మొదటి ప్రాధాన్యత ఓటు

బీజేపీ జిల్లా అధ్యక్షుడు బైరి శంకర్‌ ముదిరాజ్‌



ప్రశాంత్‌నగర్‌(సిద్దిపేట): మాట్లాడుతున్న శంకర్‌

ప్రశాంత్‌నగర్‌(సిద్దిపేట): ఉమ్మడి మెదక్‌, కరీంనగర్‌, ఆదిలాబాద్‌, నిజామాబాద్‌ ఉపాధ్యాయ, పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థులను గెలిపించాలని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు బైరిశంకర్‌ ముదిరాజ్‌ పిలుపునిచ్చారు. ఆ పార్టీ జిల్లా కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 27న జరగనున్న ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి మల్కా కొమరయ్య, పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి అంజిరెడ్డిని మొదటి ప్రాధాన్యత ఓటువేసి గెలిపించాలని కోరారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌, కాంగ్రెస్‌ పార్టీల తరపున పోటీచేసే నాయకులే లేరని విమర్శించారు. అలాగే కాంగ్రెస్‌ ప్రభుత్వం హామీలు నెరవేర్చకుండా ప్రజలను మోసం చేస్తోందని మండిపడ్డారు. రానున్న స్థానిక ఎన్నికలలో బీజేపీ జెండా ఎగురవేస్తామని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో శ్రీకాంత్‌రెడ్డి, జనార్దన్‌, మైపాల్‌, వెంకటేశం, కనకరాజు, శ్రీనివాస్‌, సంతోష్‌, సంతోష్‌ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ అభ్యర్థికి మద్దతుగా ప్రచారం

బెజ్జంకి(సిద్దిపేట): కరీంనగర్‌, మెదక్‌, ఆదిలాబాద్‌, నిజామాబాద్‌ జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థిగా బీజేపీ బలపరుస్తున్న అంజిరెడ్డిని గెలిపించాలని కోరుతూ మండలంలోని వీరాపూర్‌లో ఆ పార్టీ నాయకులు ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో శ్రీధర్‌రావు, రజిత, రాంరెడ్డి, అంజిరెడ్డి, చంద్రయ్య, కనుకయ్య తదితరులు పాల్గొన్నారు.

మందుబాబులకు జరిమానా

సిద్దిపేటకమాన్‌: మద్యం తాగి వాహనాలు నడుపుతూ పట్టుబడిన వారికి కోర్టు జరిమానా విధించిందని ట్రాఫిక్‌ సీఐ ప్రవీణ్‌కుమార్‌ తెలిపారు. పట్టణంలోని పలు ప్రాంతాలలో వారం రోజుల క్రితం నిర్వహించిన తనిఖీల్లో ఆరుగురు పట్టుబడ్డారు. శుక్రవారం కోర్టులో హాజరుపర్చగా న్యాయమూర్తి వారికి రూ.9,500 జరిమానా విధించినట్లు ఆయన చెప్పారు.

సెల్‌ఫోన్‌లు అప్పగింత



సెల్‌ఫోన్‌ అందజేస్తున్న సీపీ అనురాధ

సిద్దిపేటకమాన్‌: పలువురు పోగొట్టుకున్న సెల్‌ఫోన్‌లను నూతన టెక్నాలజీ సాయంతో గుర్తించి ఆయా బాధితులకు సీపీ అనురాధ అందజేశారు. కొన్ని రోజులుగా పలువురు తమ సెల్‌ఫోన్‌లను పోగొట్టుకున్నారు. దీంతో బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు సీఈఐఆర్‌ యాప్‌ ద్వారా 105 సెల్‌ఫోన్‌లను గుర్తించి బాధితులకు శుక్రవారం అందజేసినట్లు పోలీసు అధికారులు తెలిపారు. సెల్‌ఫోన్‌ల రికవరీలో ప్రతిభ కనబర్చిన సిబ్బందిని సీపీ అభినందించారు. కార్యక్రమంలో ఐటీ సెల్‌ ఇన్‌స్పెక్టర్‌ శ్రీధర్‌గౌడ్‌ తదితరులు పాల్గొన్నారు.

రేపు పట్టభద్రుల ఆత్మీయ సమ్మేళనం

కాంగ్రెస్‌ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి హరికృష్ణ



మాట్లాడుతున్న హరికృష్ణ

ప్రశాంత్‌నగర్‌(సిద్దిపేట): జిల్లా కేంద్రంలో శనివారం నిర్వహించనున్న పట్టభద్రుల ఆత్మీయ సమ్మేళనాన్ని విజయవంతం చేయాలని కాంగ్రెస్‌ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి హరికృష్ణ పిలుపునిచ్చారు. స్థానిక పార్టీ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉమ్మడి మెదక్‌, నిజామాబాద్‌, కరీంనగర్‌, ఆదిలాబాద్‌ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్‌ అభ్యర్థి నరేందర్‌రెడ్డిని భారీ మెజారిటీతో గెలిపించాలన్నారు. మొట్టమొదటిసారిగా ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి పట్టభద్రులతో ఆత్మీయ సమ్మేళనం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మంత్రులు కొండా సురేఖ, పొన్నం ప్రభాకర్‌, దామోదర రాజనర్సింహ, మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు, కాంగ్రెస్‌ పార్టీ ఎమ్మెల్సీ అభ్యర్థి నరేందర్‌రెడ్డి తదితరులు హాజరవుతారని చెప్పారు. శక్తి గార్డెన్‌లో సాయంత్రం 5 గంటలకు ప్రారంభమవుతుందని, పట్టభద్రులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు హాజరుకావాలని కోరారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు అత్తు ఇమామ్‌, టీపీసీసీ సభ్యుడు మహేందర్‌, గోపీకృష్ణ, జిల్లా మహిళా అధ్యక్షురాలు ముద్దం లక్ష్మి, వహీద్‌ ఖాన్‌, ఖలీమొద్దీన్‌, రాషాద్‌, మెరుగు రాజు, గయాజొద్దీన్‌, సంతోష, రజని, సన, జనార్దన్‌ తదితరులు పాల్గొన్నారు.

మద్యం తాగి వాహనాలు నడపొద్దు: సీఐ శ్రీను

చేర్యాల(సిద్దిపేట): మద్యం సేవించి వాహనాలు నడపొద్దని సీఐ ఎల్‌.శ్రీను వాహనదారులకు సూచించారు. ఇటీవల డ్రంకెన్‌ డ్రైవ్‌లో పట్టుబడిన 22 మందికి స్థానిక సీఐ కార్యాలయంలో శుక్రవారం ఆయన కౌన్సిలింగ్‌ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మద్యం సేవించి వాహనాలు నడిపవద్దని, ఏదైనా ప్రమాదం జరిగితే కుటుంబానికి తీరని నష్టం జరుగుతుందన్నారు. అలాగే తప్పకుండా హెల్మెట్‌ ధరించాలని, రాంగ్‌ రూట్లో ప్రయాణం చేయవద్దని సూచించారు. అలాగే మైనర్‌లకు వాహనాలు ఇవ్వొద్దని చెప్పారు. కార్యక్రమంలో ప్రొబెషనరీ ఎస్‌ఐ మానసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సతీశ్‌కుమార్‌ పరామర్శ

హుస్నాబాద్‌రూరల్‌: ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడిన మండలంలోని పూల్‌నాయక్‌ తండాకు చెందిన భూక్య అనిల్‌ను శుక్రవారం మాజీ ఎమ్మెల్యే సతీశ్‌కుమార్‌ పరామర్శించారు. ధైర్యంగా ఉండాలని ఆ తల్లిదండ్రులను ఓదార్చారు.

చెల్లించకపోతే చర్యలు

గజ్వేల్‌రూరల్‌: గజ్వేల్‌–ప్రజ్ఞాపూర్‌ మున్సిపాలిటీ పరిధిలోని గృహ, వాణిజ్య సముదాయాల వారు మొండి బకాయిలు చెల్లించకపోతే చర్యలు మున్సిపల్‌ కమిషనర్‌ గోల్కొండ నర్సయ్య హెచ్చరించారు. తప్పనిసరిగా నల్లా, ఇంటి పన్నులు, ట్రేడ్‌ లైసెన్స్‌ చెల్లించాలని సూచించారు. కార్యక్రమంలో అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



కొమురవెల్లి(సిద్దిపేట): స్వపరిపాలన దినోత్సవంలో పాల్గొన్న విద్యార్థులు, ఉపాధ్యాయులు



చిన్నకోడూరు(సిద్దిపేట): విఠలాపూర్‌ పాఠశాలలో ఉపాధ్యాయులతో విద్యార్థులు

విద్యార్థులే ఉపాధ్యాయులైన వేళ

జిల్లా వ్యాప్తంగా పలు పాఠశాలల్లో స్వపరిపాలన దినోత్సవాన్ని శుక్రవారం ఘనంగా జరుపుకొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఉపాధ్యాయులుగా మారి తోటివారికి పాఠాలు బోధించారు. ప్రతిభ చూపిన విద్యార్థులకు హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు బహుమతులు ప్రదానం చేశారు. ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



సిద్దిపేటరూరల్‌: బుస్సాపూర్‌ పాఠశాలలో..



మర్పడ్గ ప్రాథమిక పాఠశాలలో..



తొగుట(దుబ్బాక): ఉపాధ్యాయులతో విద్యార్థులు

ఎఫ్‌ఎస్‌టీపీ ఎరువులతో ఎంతో లాభం

మున్సిపల్‌ కమిషనర్‌ శ్రీనివాస్‌రెడ్డి



ఎఫ్‌ఎస్‌టీపీని పరిశీలిస్తున్న శ్రీనివాస్‌ రెడ్డి

దుబ్బాకటౌన్‌: మానవ ఘన వ్యర్థాల శుద్ధీకరణ కేంద్రం(ఎఫ్‌ఎస్‌టీపీ) ద్వారా తయారయ్యే ఎరువులతో మంచి దిగుబడులు పొందవచ్చని మున్సిపల్‌ కమిషనర్‌ శ్రీనివాస్‌రెడ్డి చెప్పారు. రూ.73 లక్షలతో దుబ్బాక శివారులో ఇటీవల ప్రారంభించిన మానవ ఘన వ్యర్థాల శుద్ధీకరణ కేంద్రాన్ని శుక్రవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా యంత్రాల పనితీరు, ఎరువుల తయారీ విధానం గురించి సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఎఫ్‌ఎస్‌టీపీ ద్వారా మానవ ఘన వ్యర్థాలను ఎరువులుగా తయారు చేసే ప్రక్రియ ప్రారంభించామని దీనికి ప్రజలు సహకరించాలని కోరారు. ఈ ఎరువులు మొక్కల పెంపకానికి, పంట పొలాల్లో వేయడం వల్ల అధిక దిగుబడి పొందవచ్చని సూచించారు. అనంతరం నర్సరీని పరిశీలించి మొక్కలకు నీళ్లు పట్టారు. కార్యక్రమంలో ఏఈ శ్రీకాంత్‌, సిబ్బంది పాల్గొన్నారు.

కాంగ్రెస్‌ బలపరిచిన అభ్యర్థి నరేందర్‌రెడ్డి

మానకొండూర్‌ ఎమ్మెల్యే కవ్వంపల్లి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కవ్వంపల్లి

బెజ్జంకి(సిద్దిపేట): కరీంనగర్‌, మెదక్‌, ఆదిలాబాద్‌, నిజామాబాద్‌ పట్టభద్రుల ఎన్నికలలో కాంగ్రెస్‌ బలపరుస్తున్న ఉట్కూరు నరేందర్‌రెడ్డి గెలిపించాలని మానకొండూర్‌ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ కోరారు. బెజ్జంకిలో కాంగ్రెస్‌ పార్టీ, అనుబంధ విభాగాల నాయకులతో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి గ్రామంలో నాయకులు, కార్యకర్తలు నరేందర్‌రెడ్డి గెలుపు కోసం పాటుపడాలన్నారు. బ్యాలెట్‌లో 2వ నంబర్‌పై మొదటి ప్రాధాన్యత ఓటువేసి గెలిపించాలని పట్టభద్రులను కోరారు. సమావేశంలో బ్లాక్‌ కాంగ్రెస్‌ అధ్యక్షుడు ఒగ్గు దామోదర్‌, పార్టీ మండల అధ్యక్షుడు ముక్కిస రత్నాకర్‌రెడ్డి, మార్కెట్‌ కమిటీ చైర్మన్‌ పులి కృష్ణ, వైస్‌ చైర్మన్‌ చిలువేరు శ్రీనివాస్‌ రెడ్డి, రవీందర్‌, జ్యోతి, లక్ష్మి, వివిధ గ్రామాల నాయకులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

సిద్దిపేటకమాన్‌: రోడ్డు ప్రమాదంలో గాయపడిన ఓ వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందాడు. టూటౌన్‌ సీఐ ఉపేందర్‌ కథనం ప్రకారం.. ములుగు కృష్ణ (42) భార్యాపిల్లలతో సిద్దిపేటలోని వాసవీనగర్‌లో నివాసం ఉంటున్నాడు. కృష్ణ గురువారం సాయంత్రం పని నిమిత్తం నర్సాపూర్‌కు వెళ్లి ద్విచక్ర వాహనంపై తిరిగి ఇంటికొస్తున్నాడు. నర్సాపూర్‌ చౌరస్తా సమీపంలో రోడ్డుపై నిలిచి ఉన్న డీసీఎం వాహనాన్ని బైక్‌తో ఢీ కొట్టాడు. దీంతో అతడిని తీవ్రమైన గాయాలు కాగా సిద్దిపేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌ గాంధీ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు. మృతుడి భార్య హారిక ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

మూర్ఛతో కిందపడి..

గజ్వేల్‌రూరల్‌: చికిత్స పొందుతూ ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన మున్సిపాలిటీ పరిధిలోని ఆర్‌అండ్‌ఆర్‌ కాలనీలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఏటిగడ్డ కిష్టాపూర్‌కు చెందిన నిమ్మరాజు కిషన్‌(38)కు భార్యతో పాటు ఇద్దరు కూతుర్లు ఉన్నారు. ఈ క్రమంలో ఆయన మూడు రోజుల క్రితం మూర్ఛ రావడంతో కిందపడిపోయాడు. దీంతో అతడి తలకు గాయాలయ్యాయి. కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం ఆర్‌వీఎం ఆసుపత్రికి తీసుకువెళ్లగా అక్కడ చికిత్స పొందుతూ పరిస్థితి విషమించడంతో గురువారం రాత్రి మృతి చెందాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు శుక్రవారం కేసు నమోదు చేశారు.

సంక్షిప్త వార్తలు

◆ 'లక్ష్యాలు–సాధనాలు'పై కార్యశాల

సిద్దిపేటఎడ్యుకేషన్‌: ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో ఆంగ్ల విభాగం ఆధ్వర్యంలో లక్ష్యాలు–సాధనాలు అనే అంశంపై శుక్రవారం ఒక రోజు కార్యశాల నిర్వహించారు. కార్యక్రమానికి అటానమస్‌ కళాశాల ఆంగ్ల సహాయాచార్యులు మామిడాల శ్రీనివాస్‌ హాజరై మాట్లాడారు. విద్యార్థినులు ఉన్నత లక్ష్యాలు సాధించేందుకు అవసరమైన నైపుణ్యాలను పెంపొందించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్‌ డాక్టర్‌ జీవన్‌కుమార్‌, వైస్‌ ప్రిన్సిపాల్‌ డాక్టర్‌ శ్యామ్‌, ఐక్యూఏసీ కోఆర్డినేటర్‌ డా.స్రవంతి, అధ్యాపకులు డా.సువర్ణాదేవి, కిషోర్‌, హరిప్రసాద్‌, స్వప్న, ఇందిర, నాగరాణి పాల్గొన్నారు.

◆ పంచాయతీ కార్యదర్శిని తొలగించండి

ములుగు(గజ్వేల్‌): మాదిగ మహిళలను కించపరిచిన వాగునూతి పంచాయతీ కార్యదర్శిని తక్షణమే విధుల నుంచి తొలగించాలని ఎమ్మార్పీఎస్‌ జిల్లా ఉపాధ్యక్షుడు బుడిగ మహేశ్‌, మండల అధ్యక్షుడు ఆదాస్‌ మహేశ్‌ తదితరులు డీఎల్‌పీఓ లతకు శుక్రవారం వినతిపత్రం అందజేశారు. దీంతో డీఎల్‌పీఓ శుక్రవారం వాగునూతిలో విచారణ చేపట్టారు. కార్యక్రమంలో నాయకులు రాజు, వినోద్‌, అశోక్‌, శ్రీనివాస్‌, సురేందర్‌, నరేంరెందర్‌, పోచయ్య, మల్లేశ్‌, వెంకటేశ్‌ పాల్గొన్నారు.

◆ ఎమ్మెల్సీ అభ్యర్థికి మద్దతుగా ప్రచారం

ప్రశాంత్‌నగర్‌(సిద్దిపేట): ఉమ్మడి మెదక్‌, కరీంనగర్‌, నిజామాబాద్‌, ఆదిలాబాద్‌ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థిగా కాంగ్రెస్‌ పార్టీ బలపర్చిన నరేందర్‌రెడ్డికి ప్రథమ ప్రాధాన్యత ఓటువేసి గెలిపించాలని పీసీసీ కార్యదర్శి గాడిపల్లి శ్రీనివాస్‌రెడ్డి కోరారు. నరేందర్‌రెడ్డికి మద్దతుగా శుక్రవారం పట్టణంలోని పలు కళాశాలలో ప్రచారం చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్‌ పార్టీ నాయకులు బాల్‌రెడ్డి, అనిల్‌, మహేందర్‌రెడ్డి, విజయ్‌, తదితరులు పాల్గొన్నారు.

రాంచంద్రపూర్‌లో..

కోహెడరూరల్‌(హుస్నాబాద్‌): మెదక్‌, ఆదిలాబాద్‌, నిజామాబాద్‌, కరీంనగర్‌ పట్టభద్రుల ఎమ్మెల్సీగా కాంగ్రెస్‌ అభ్యర్థి నరేందర్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని హుస్నాబాద్‌ యూత్‌ కాంగ్రెస్‌ అధ్యక్షుడు శివరెడ్డి కోరారు. మండలంలోని రాంచంద్రపూర్‌ గ్రామంలో శుక్రవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో పీఏసీఎస్‌ మార్కెట్‌ కమిటీ వైస్‌ చైర్మన్‌ తిరుపతిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

◆ మార్పు కోసం వస్తున్నా..

సిద్దిపేటకమాన్‌: మార్పు కోసం వస్తున్న తనను ఆశీర్వదించాలని పట్టభద్రుల స్వతంత్ర ఎమ్మెల్సీ అభ్యర్థి యాదగిరి శేఖర్‌రావు కోరారు. సిద్దిపేట ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ తనను గెలిపిస్తే ఆరు సంవత్సరాల్లో ప్రతినెలా జీతం ఒక్కొక్క మండలానికి ఇచ్చి ఉచితంగా కోచింగ్‌ రిసోర్స్‌ సెంటర్లు ఏర్పాటు చేసి పట్టభద్రుల అభివృద్ధికి దోహదపడుతానన్నారు. జూనియర్‌ లాయర్లకు స్టైఫండ్‌ ఇచ్చేలా కృషి చేస్తానని చెప్పారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో మొదటి ప్రాధాన్యత ఓటు తనకువేసి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా ట్రస్మా అధ్యక్షుడు నరసింహారెడ్డి, శ్రీధర్‌రెడ్డి, సుభాష్‌, శైలేందర్‌, నారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

◆ సైబర్‌ నేరాలపై అవగాహన

సిద్దిపేటఎడ్యుకేషన్‌: ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో మహిళల భద్రత, సైబర్‌నేరాలు, మాదకద్రవ్యాల నివారణ అనే అంశంపై శుక్రవారం అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా త్రీటౌన్‌ సీఐ విద్యాసాగర్‌ మాట్లాడుతూ విద్యార్థినులు సైబర్‌ నేరాలు, మహిళల అక్రమ రవాణాపై అప్రమత్తంగా ఉండాలన్నారు. అత్యవసర పరిస్థితుల్లో 100కు డయల్‌ చేయాలని కోరారు. ప్రిన్సిపాల్‌ డాక్టర్‌ జీవన్‌కుమార్‌ మాట్లాడుతూ ఇలాంటి కార్యక్రమాల వల్ల మహిళల్లో మనోధైర్యం పెంపొందుతుందన్నారు. కార్యక్రమంలో కళాశాల ఐక్యూఏసీ కోఆర్డినేటర్‌ డా.స్రవంతి, సాధికారిత విభాగం బాధ్యులు డా.శ్వేత, డా.సువర్ణాదేవి, అధ్యాపకులు కిషోర్‌, హరిప్రసాద్‌, డా.స్వప్న షీటీం బాధ్యులు కిషన్‌, మమత తదితరులు పాల్గొన్నారు.

◆ ఉత్సాహంగా మాతృభాషా దినోత్సవం

గజ్వేల్‌రూరల్‌: అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవాన్ని శుక్రవారం పట్టణంలోని బాలుర ఎడ్యుకేషన్‌ హబ్‌లోగల ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఘనంగా నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్‌ డాక్టర్‌ నిక్కత్‌ అంజుమ్‌ మాట్లాడుతూ మాతృభాషను కాపాడుకుంటూ పరభాష జ్ఞానాన్ని పెంపొందించుకోవాలన్నారు. కార్యక్రమంలో వైస్‌ ప్రిన్సిపాల్‌ గణపతి రావు, అధ్యాపకులు వెంకటేశ్‌, మహేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మహిళా కళాశాలలో..

సిద్దిపేటఎడ్యుకేషన్‌: సిద్దిపేట ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్‌ డాక్టర్‌ జీవన్‌కుమార్‌, వైస్‌ ప్రిన్సిపాల్‌ డాక్టర్‌ శ్యామ్‌, తెలుగు అధ్యాపకులు ఉమారాణి తదితరులు మాతృభాష గొప్పతనాన్ని గురించి వివరించారు. కార్యక్రమంలో బోధన, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

◆ లక్ష్యాన్ని ఏర్పరుచుకొని కృషి చేయాలి

చేర్యాల(సిద్దిపేట): విద్యార్థులు ఉన్నతమైన లక్ష్యాన్ని ఏర్పరుచుకొని కృషి చేయాలని ఓయూ ఆర్ట్స్‌ కళాశాల వైస్‌ ప్రిన్సిపాల్‌ ప్రొ.కొండా నాగేశ్వర్‌ సూచించారు. శుక్రవారం మండల పరిధిలోని ముస్త్యాల మోడల్‌ స్కూల్‌లో నిర్వహించిన పీఎంశ్రీ కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు. కార్యక్రమంలో భాగంగా 10వ తరగతి, ఇంటర్మీడియెట్‌ మొదటి, రెండో సంవత్సరం విద్యార్థులకు త్వరలో జరగనున్న పరీక్షలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్‌ భిక్షం, వైస్‌ ప్రిన్సిపాల్‌ నరేందర్‌రెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

◆ దరఖాస్తుల ఆహ్వానం

బెజ్జంకి(సిద్దిపేట): బెజ్జంకి సహకార సంఘం ఆధ్వర్యంలో నూతనంగా నిర్మించిన ఏసీ ఫంక్షన్‌ హాల్‌ నిర్వహణ కోసం ఈనెల 28 లోగా దరఖాస్తులు చేసుకోవాలని సీఈఓ వాసు శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సంవత్సరానికి రూ.12 లక్షలు లీజుకు ఇస్తామని, ఆసక్తి గలవారు రూ.50 వేలు చెల్లించి ఓపెన్‌ టెండర్‌లో పాల్గొనాలని సూచించారు.

◆ వివాదాస్పద ఇంటి స్థలాలపై విచారణ

హుస్నాబాద్‌రూరల్‌: మండలంలోని బంజేరుపల్లి, గాంధీనగర్‌ గ్రామాల్లో వివాదాల్లో ఉన్న ఇంటి స్థలాలపై ఎంపీడీఓ వేణుగోపాల్‌రెడ్డి శుక్రవారం విచారణ జరిపినట్లు చెప్పారు. బంజేరుపల్లిలో ఇద్దరు అన్నదమ్ముల ఇళ్ల విషయంలో ఫిర్యాదు చేయగా అధికారుల సమక్షంలోనే విచారించారు.

◆ విగ్రహాల ప్రతిష్ఠకు ఏర్పాట్లు

ములుగు(గజ్వేల్‌): మండలంలోని గంగాధర్‌పల్లివేణుగోపాలస్వామి ఆలయంలో 23న వివిధ విగ్రహాల ప్రతిష్ఠ మహోత్సవాలకు ఏర్పాట్లు చేస్తున్నట్టు నిర్వాహకులు శుక్రవారం తెలిపారు. ఆదివారం ఉదయం 10 గంటలకు ప్రారంభయ్యే మహోత్సవంలో ప్రత్యేక పూజలు చేస్తున్నట్టు నిర్వాహకులు వసంతరావు, శ్రీకాంత్‌రెడ్డి తెలిపారు.